ప్రజాశక్తి
శనివారం 30 నవంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

డిఆర్ఒగా హేమలత

కెఆర్ సిసి డిప్యూటీ కలెక్టర్‌గా ధర్మ చంద్రారెడ్డి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా రెవెన్యూ అధికారిగా కె.హేమలత నియామక మయ్యారు. గతంలో పార్వతీపురం డివిజన్ రెవెన్యూ అధికారిగా పని చేసిన హేమలతను ప్రస్తుతం డిఆర్ఒగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కెఆర్ సిసి డిప్యూటీ కలెక్టర్‌గా ధర్మ చంద్రారెడ్డిని నియమించారు. జిల్లాలో ఇప్పటి వరకూ డిఆర్ఒగా పని చేసిన కేశవనాయుడు అనంతపురం బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇన్‌ఛార్జి డిఆర్వోగా సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ వ్యవహరిస్తున్నారు.

రైతుల్లో 'ఫెంగల్' అలజడి

జిల్లాలో వరి కోతలు పూర్తయి, నూర్పులు కొనసాగించి ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రయత్నంలో ఉండగా అకస్మాత్తుగా ఏర్పడిన బంగాళా ఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను అన్నదాత గుండెల్లో అలజడి రేపింది. తుపాను కారణంగా శుక్రవారం సాయంత్రం నుంచి జిల్లా అంతటా చినుకులు కురవడంతో పంటను కాపాడుకొనేందుకు రైతులు నానా అవస్థలుపడుతున్నారు.

మక్కువ మండలంలో కోత కోసి పొలాల్లో గల వరి పంట

- జిల్లా అంతటా చిరుజల్లులు
- పొలాల్లో వరి దిబ్బలు, ఓవులు
- పంటను కాపాడు కొనేందుకు రైతుల అవస్థలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం, పాలకొండ డివిజన్లోని పలు గ్రామాల్లో రైతులు కోసిన పంటను పొలాల్లో కుప్పలుగా వేసుకొనేందుకు, నూర్పులు సాగించిన ధాన్యం తడవకుండా చూసేందుకు పరుగులు తీస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ వ్యవసాయ అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో అల్పపీడనం కారణంగా జిల్లాలో శుక్రవారం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈలోగా రైతులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, కళ్లాల్లో ఉండే ధాన్యాన్ని వెంటనే బస్తాల్లో నింపుకొని ఇళ్లు, మిల్లుల వద్ద భద్రపరచుకోవాలని సూచించారు. ధాన్యం తడవకుండా చూడాలని, కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అయినా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఈ తుఫానుపై ఎలాంటి ముందస్తు సూచనలు రైతులకు చేయకపోవడంతో తమ ధాన్యాన్ని కళ్లాల్లోనే ఉంచుకునే పరిస్థితి ఏర్పడింది. అల్పపీడనం రానున్న రోజుల్లో తీవ్రమైతే రైతులు ఏ విధంగా తమ పంటను సంరక్షించుకోవాలో తెలియని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. గత కొన్నేళ్లుగా రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం కోసం టార్పాలిన్ సరఫరా చేయలేదు. దీంతో పంటను కాపాడుకునేందుకు కనీసం ప్లాస్టిక్ పరదాలు కూడా లేని పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది జిల్లాలో లక్షా75, 454 ఎకరాల్లో వరి సాగైంది. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో మిల్లర్లతో ఏర్పడిన సమస్య వల్ల జాప్యం జరిగింది. దీంతో రైతులు పండిన పంటను నూర్పిడి చేయడానికి పెద్దగా ఆసక్తి చూపకుండా కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూశారు. తీరా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్న సమయంలో ఈ అకాల వర్షాల వల్ల తాము ఎక్కడ తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందో, ఆరుగాలం పండించిన పంట చేతికి దక్కుతుందో లేదో అని మధనపడుతున్నారు. ఎప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగపర్చి కళ్లాలోని ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

వీరఘట్టం : తుఫాన్ ప్రభావంతో శుక్రవారం సాయంత్రం వర్షం కురవడంతో వరి కుప్పలు, ఓవులు తడిసి ముద్దయ్యాయి. గత రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు రావడంతో కొంతమంది అన్నదాతలు కోసిన పంటను వరికుప్పలు వేసుకోవడం, మరి కొంతమంది నాటుబళ్లతో నేరుగా కళ్లాలకు తరలించారు. మరికొన్ని చోట్ల ఓవులు తడిసి ముద్దాయి.

పాలకొండ : తుఫాన్ కారణంగా పాలకొండ పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. మండలంలో బాసురు, కోటిపల్లి, రాజుపేట తదితర ప్రాంతాల్లో కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు ఆందోళన చెందారు. శనివారం కూడా ఇలాగే వర్షం పడితే తమ పరిస్థితి ఆగమ్యాగోచారం అవుతుందని తీవ్ర ఆందోళన పడుతున్నారు.

పార్వతీపురంలో వరిదిబ్బలు వేస్తున్న రైతులు

కురుపాం : మండల కేంద్రంతో పాటు పరిసర గిరిజన గ్రామాల్లో శుక్రవారం రాత్రి చిరుజల్లులు కురుస్తున్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో ఇలా తుఫాను రూపంలో వర్షాలు పడడంతో ధాన్యం పాడై మొక్క మొలుస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వేలాది రూపాయలు మదుపులు పెట్టి తీరా పంట చేతికి వచ్చిందన్న సమయంలో ఇలా తుఫాను రూపంలో ముంచేస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మక్కువ : తుఫాను ప్రభావంతో శుక్రవారం సాయంత్రం ముసురు ప్రారంభమైంది. ఈనెల 27న తుఫాను వస్తుందన్న ముందస్తు ప్రకటనను రైతులు తెలుసుకున్నా తుఫాను జాడలు లేకపోవడంతో గురువారం నుంచే వరి చేను కోతలు మొదలెట్టారు. అయితే ప్రస్తుత శుక్రవారం వర్షం పడడంతో వరి చేను పూర్తిగా తడిసి ముద్దవుతుంది.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పి మాధవరెడ్డి పాల్గొన్న అధికారులు

గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణా నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు వినియోగిస్తున్న స్నిఫర్ డాగ్స్, ఎన్ఫోర్స్మెంట్‌తో పాటు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకు సిసి కెమెరాలను వినియోగించుకోవాలని సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణా, నివారణకు పోలీసు, ఫారెస్ట్, ఎక్సైజ్ శాఖలతో జాయింటు ఆపరేషను నిర్వహించాలని తెలిపారు. బస్సులు, రైల్వే స్టేషన్లలో తనిఖీలు చేపట్టాలన్నారు. చెక్ పోస్టులు వద్ద సిసి కెమెరాలు, డ్రోన్లను వినియోగించి నిఘా మరింత పెంచాలని తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, సరఫరా చేసేవారికి విధిగా శిక్షలు పడేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణా చేసే వారికీ వేసే శిక్షలు గుర్తించి అందరికీ తెలిసేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అటవీ ప్రాంతం గుండా జరిగే రవాణాకు అటవీ శాఖ అడ్డుకట్ట వేయాలని ఆయన సూచించారు. విద్యా సంస్థల వద్ద అవగాహన కల్పించాలన్నారు. విద్యా సంస్థల దగ్గరలో గల షాపుల్లో తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపే షాపులను మూసివేయించాలని తెలిపారు. నాటు సారా తయారుచేసే వారిపై తనిఖీలు నిర్వహించి, పీడీ యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను రూపు మాపడమే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా మీదుగా రవాణా జరుగకుండా అన్ని శాఖలు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అవసరమైన చోట స్నిఫర్ డాగ్స్, చెక్ పోస్టుల వద్ద సీసీ కెమెరాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, పాలకొండ డిఎస్పీ రాంబాబు, డిఎఫ్ఒ జిఎపి ప్రసూన, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు మండల కార్యాలయంలో బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ కె.రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 24-25 సంవత్సరానికి గానూ సవరణ బడ్జెట్, 25-26 సంవత్సరానికి గానూ అంచనా బడ్జెట్ ఎంపిపి మజ్జి శోభారాణి అధ్యక్షతన జరిగే సమావేశంలో సమర్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలతో పాటు సర్పంచులు హాజరు కావాలని ఆయన కోరారు.

మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

10, 11 తేదీల్లో సిపిఎం పదో జిల్లా మహాసభ

ప్రజాశక్తి - కురుపాం

నియోజవర్గ కేంద్రమైన కురుపాం డిసెంబర్ 10, 11 తేదీల్లో సిపిఎం 10వ జిల్లా మహాసభలు జరుగుతాయని, ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. శుక్రవారం కురుపాంలో గల రావాడ జంక్షన్ వద్ద పదో మహాసభల పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన్యం ప్రాంతంలో అనేక ప్రజా సమస్యలు పరిష్కారానికి ఉద్యమాలు నిర్వహించి ప్రజల పక్షాన నిలబడింది సిపిఎం పార్టీనని, వాటిని సమీక్షించుకొని రాబోయే కాలంలో జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంతో పోరాటాలకు సమాయత్తమవుతుందని అన్నారు. జంఝావతి ప్రాజెక్టు, మినీ రిజర్వాయర్లు, గిరిజన ప్రాంతంలో చెక్ డాంలు నిర్మించాలని, గిరిజన ప్రాంతంలో అటవీ ఉత్పత్తులు జీడి, చింతపండు, పైనాపిల్ తదితర పంటలతో చిన్న పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించాలని, పార్వతీపురంలో మెడికల్ కాలేజీ వెంటనే నిర్మించాలని, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన పేద విద్యార్థులకు ఆయా తరగతులకు జిల్లాలో ఇంజనీరింగ్, పీజీ కోర్సులు వెంటనే ప్రారంభించాలని, వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, రోడ్లు, వంతెనలు వంటి మౌలిక సదుపాయాలు, సాగు, తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. పార్టీలు మారినా, నాయకులు వారేనని, కావున పాలకుల మీద ఆశలు పెట్టుకొని ప్రజలు పోరాడకపోతే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంటుందని అన్నారు. జిల్లాలో చెరకు రైతుల ఉద్యమించి రూ.90 కోట్లు బకాయి సాధించుకున్నారని, భూపోరాటాలతో దళితులు, పేదలు భూములు సాధించారని, పెండింగ్ లో ఉన్న శివ్వాం, దళితులు, గిరిజనులు భూ సమస్యలపై పోరాటాల కొనసాగుతున్నాయని, తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై పోరాడి నష్టపరిహారం సాధించామని, ఉమ్మడి విజయనగరం, పార్వతీపురం జిల్లా కమిటీగా పోరాడి సాధించు కున్నట్లే ప్రజా ఉద్యమాల్లో పాల్గొని పోరాటాల ద్వారా జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కావున ఉద్యమాలకు ప్రజలంతా కలిసి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్, కె.గంగు నాయుడు, మండల కార్యదర్శులు మండంగి శ్రీనివాసరావు, కె.సీతారాం, నాయకులు వెంకట్రావు, అనీల్ కుమార్, ఇండియా, సింహాచలం పాల్గొన్నారు.

సర్క్యూట్ టూరిజంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అనేక పర్యాటక, సుందర ప్రదేశాలు ఉన్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యాటక మండలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీతంపేట, పార్వతీపురం, సాలూరు, గుమలక్ష్మీపురం ప్రాంతాల్లోని జలపాతాలు, ప్రకృతి సిద్ధమైన ప్రదేశాలను కలుపుతూ సర్క్యూట్ టూరిజంను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను సమర్పించాలని, ప్రతి పర్యాటక ప్రాంతాన్ని సందర్శిందేందుకు వీలుగా రహదారి సౌకర్యంతో పాటు మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులను ఏర్పాటు చేయాలని అన్నారు. వీటితో పాటు ముఖద్వారం, మెట్లు, ఆట పరికరాలు, ఇతరత్రా సదుపాయాలు కల్పించాలని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. జిల్లాలోని పెద్దగెడ్డ, ఒట్టిగెడ్డ జలాశయాలు, వేగావతి, సువర్ణముఖీ నదీ ప్రాంతాలు, వీరఘట్టం వద్ద గల పెద్ద చెరువు తదితర ప్రదేశాల్లో వాటర్ పార్కులను అభివృద్ధి చేసేందుకు అనుకూలమని, వీటిపై దృష్టి సారించాలని అన్నారు. అలాగే గిరి గ్రామదర్శిని తరహాలో అంత కంటే మిన్నగా ఉండే ప్రాంతాన్ని గుర్తించి, గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని, ఇందుకు సంబంధించిన ప్రణాళికను పది రోజుల్లోగా సిద్ధం చేయాలని సబ్ కలెక్టరును ఆదేశించారు. అడలి లో రెండో దశ కింద విఐపిల కోసం గాజుతో తయారుచేసిన గదులను నిర్మించాలని, అడలి అందాలపై చిత్రీకరించిన వీడియోపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. మక్కువ ప్రాంతం కూడా పర్యాటకానికి అనువుగా ఉంటుందని, వీటిపై ఆలోచన చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రముఖ దేవాలయాలను కలుపుతూ టెంపుల్ సర్క్యూట్ టూరిజంపై దృష్టి పెట్టాలని అన్నారు. వీటిపై ఆయా అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో డిఎఫ్ఒ జిఎపి ప్రసూన, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, దేవాదాయ శాఖ ఇఒ వివిఎస్ నారాయణ, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ ఎపిఒలు పి.మురళీధర్, జి.చిన్నబాబు, పిహెచ్ఒ ఎస్‌వి గణేష్, అడలి అండ్ ఎం ఎం.విజయ్, జట్టు ట్రస్ట్ డాక్టర్ డి.పారినాయుడు, హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి హెచ్ఎస్.ఇబ్రహీం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'సదరం'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కురుపాం

సదరం శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

వికలాంగులు, వయోవృద్ధుల కోసం ఏర్పాటు చేసిన సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద హైదరాబాదుకు చెందిన అలిమ్ కో సంస్థ, ఎస్ సొసైటీ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉపకరణాలు గుర్తింపు శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో గుర్తించిన వారికి రెండు నెలల్లో ఉపకరణాలు అందజేస్తామన్నారు. కావున నియోజకవర్గంలో గల ఐదు మండలాల వయోవృద్ధులు, వికలాంగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐదు మండలాల నుంచి 161 మంది ఉపకరణాలు పొందేందుకు అర్హత పొందాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ ఎడి కె .కవిత, మండల ప్రత్యేక అధికారి రామచంద్రరావు, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, తహశీల్దార్ ఎం.రవణమ్మ, ఇఒపిఆర్‌డి జి.రమేష్ బాబు, టిడిపి నాయకులు కోలా రంజిత్‌కుమార్, మండల కన్వీనర్ కె.వి కొండయ్య, ఎస్.సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, అలిమ్ కో సంస్థ ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

త్వరలో భామినిలో పత్తి కొనుగోలు కేంద్రం

ప్రజాశక్తి - పార్వతీపురం

భామినిలో పత్తి కొనుగోలు కేంద్రంను త్వరలో ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంబంధిత అధికారులతో చర్చించడం జరిగిందని ఆయన చెప్పారు.

అవుట్ సోర్సింగ్ టీచర్లకు మద్దతు పలకాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహనరావు

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటానికి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు మద్దతు తెలపాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు కోరారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయ బద్ధమైన డిమాండ్లు ఆమోదించకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు దిగుతోందన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను గురుకుల పాఠశాలల్లో డెప్యుటేషన్‌పై పంపించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమని చెప్పారు. ప్రభుత్వం తాజా ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు చేస్తున్నసమ్మెను, పోరాటాన్ని నిరుగార్చేలా గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను, గిరిజన గురుకుల పాఠశాలకు డెప్యూటేషన్ వేస్తూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు తక్షణమే వెనక్కి తీసుకోవాలని ముక్త కంఠం తో డిమాండ్ చేశారు. ఈ మేరకు పదవ రోజు నిరసన దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తామని చెబుతూనే ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వడమేమిటని నిలదీశారు. తక్షణమే ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని లేదంటే పోరాటం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ దీక్షల్లో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిమ్మక దివాకర్, అరసాడ రమేష్, రాయల వెంకట్, తామర కండి రాజేష్, తుమ్మగుంట తిరుపతి నాయుడు, మీసాల శ్రీను, శోభారాణి, బిందు మాధవి, సింహాచలమమ్మ, లక్ష్మి, జ్యోతి, దీప, ఇందిరా, గున్నమ్మ, కుమారి, కాంచన, అనిత, కళావతి పాల్గొన్నారు.

సర్పంచులు సంఘీభావం

సీతంపేట : స్థానిక ఐటిడిఎ వద్ద ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల దీక్షలకు పలువురు సర్పంచులు సంఘీభావం తెలిపారు. వీరి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. 2022 పిఆర్‌సి ప్రకారం జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్, మోహన్ రావు, సర్పంచులు ఎన్.తిరుపతిరావు, కె.వెంకటనాయుడు, తిరుపతిరావు, ఎఎంసి ఛైర్మన్ మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం: అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పోరాటాన్ని నీరుగార్చేలా వారికి డెప్యూటేషన్ వేస్తూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు తక్షణమే వెనక్కి తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. పది రోజులుగా శాంతియుతంగా పోరాడుతున్న ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించకుండా వారిని భయపెట్టి మరింత ఆందోళనకు గురించేసేలా ఉత్తర్వులు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. తక్షణమే ఇచ్చిన ఉత్తర్వులు వెనక్కి తీసుకుని వారి సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే అన్ని గిరిజన, ప్రజా సంఘాలను కలుపుకుని గిరిజన శాఖ మంత్రి ఇంటి ఎదుట ఆందోళన చేస్తామని అన్నారు.

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సర్పంచ్ తిరుపతిరావు

శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పోలీసు సిబ్బంది శాఖపరమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా ఎస్పీ ఎస్ వి మాధవ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ముఖ్య ప్రాధాన్యతను ఇస్తూ సిబ్బంది వృత్తి, ఆరోగ్యం, వ్యక్తిగతమైన పలు సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ గ్రీవెన్స్-డేను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారికి ఉన్న సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. పోలీస్ సిబ్బంది విన్నపాలను పరిశీలించి సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరలోనే పరిష్కారం చూపుతామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఎస్పీ మాట్లాడి పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సిసి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

హాస్పటల్ పనులను అడిగి తెలుసుకుంటున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వేగవంతం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానికంగా జరుగుతున్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. అలాగే పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మొదటి, రెండో అంతస్తుల్లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్‌మీట్‌ను పరిశీలిస్తున్న డిఇఒ తిరుపతినాయుడు

సులభతరహా బోధనతో సత్ఫలితాలు

ప్రజాశక్తి - మక్కువ

విద్యార్థులకు సులభతరహాలో బోధనలు అందించాలని, తద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని డిఇఒ ఎన్.తిరుపతినాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. టెన్త్ సిలబస్ ఎంతవరకు పూర్తి చేశారని ఉపాధ్యాయ సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకొని జిల్లాలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అపార్ నమోదులో లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. అపార్ నమోదు వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ 7న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని, అందుకు తగ్గ ప్రణాళిక ఏ విధంగా రూపకల్పన చేస్తున్నారనే విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 శ్యాంసుందర్రావు, స్కూల్ హెచ్ఎం ఎం.హేమలత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

మండలంలోని దయానిధిపురం, గాదెలవలసలో ఇంటింటి సర్వేను మండల ప్రత్యేక అధికారి కరుణాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి జియా ట్యాగింగ్‌తో పాటు వ్యక్తిగత సమాచారాన్ని పొందుపర్చాలన్నారు. సర్వేను సచివాలయ సిబ్బంది వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. అనంతరం అంగన్వాడీ, ఆరోగ్య కేంద్రాలను, పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు బోధిస్తున్న పాఠాలను పర్యవేక్షించారు. అలాగే జోగింపేట అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఆయనతో పాటు ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, సచివాలయ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధ్యానం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. మండలంలో పూతిక వలసలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యాన్ని దళారులకు అమ్మి రైతులు మోసపోకుండా ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న ధాన్యం కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని అమ్మి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడిఎ నిర్మల జ్యోతి, టిడిపి నాయకులు కోల రంజిత్ కుమార్, మండల కన్వీనర్ కెవి కొండయ్య, బలగ రామకష్ణ, రైతులు పాల్గొన్నారు .

ఎమ్మెల్యే చెప్పినా బస్సును పునరుద్ధరించలేదు

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజల అవసరాల నిమిత్తం రాకపోకల కోసం బస్సును పునరుద్దరించాలని స్వయంగా ఎమ్మెల్యే చెప్పినా ఆర్‌టిసి అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెప్పినా బస్సును పునరుద్ధరించలేదని,పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ తీరుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తామని అన్నారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, వెంకటేష్, సిఐటియు నాయకులు గౌరు నాయుడు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజల నుంచి సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు స్వీకరించారు. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరితోనూ మాట్లాడుతూ వారి సమస్యలను సావధానంగా వింటూ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కారం చూపడం పట్ల దరఖాస్తుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ద్రవజీవామృతం తయారీ

ప్రజాశక్తి - పాచిపెంట

పెరటి తోటలకు ఎటిఎం మోడల్ కూరగాయల తోటలకు ద్రవ జీవామృతం ఎంతగానో ఉపయోగపడుతుందని దిగుబడి నాణ్యత పెరుగుతాయని భూమిలో పోషక విలువలు పెరిగి భూమి గుల్లబారుతుందని భూమిలో జీవ వైవిధ్యం పెరుగుతుందని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని చాపరాయివలసలో చదల రాజు కూరగాయల మోడల్‌కు ద్రవ జీవామృతం తయారు చేశారు. కార్యక్రమంలో మాట్లాడుతూ రసాయన ఎరువుల స్థానంలో సేంద్రియ, ప్రకృతి ఎరువులను వాడుకున్నట్లయితే ఖర్చు తగ్గుతుందన్నారు. పర్యావరణానికి హాని జరగకుండా దిగుబడి పెరగడమే కాకుండా రుచి ఎక్కువగా ఉండడం వల్ల మార్కెట్లో అధిక ధర పలుకుతుందని ఈ కూరగాయలు ఎక్కువ కాలం పాడవ్వకుండా నిల్వ ఉంటాయని తెలిపారు. అనంతరం శతాభిలో కాఫీ తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో సురేష్ పాల్గొన్నారు

ఐక్య పోరాటానికి కలిసి రండి

ప్రజాశక్తి- పార్వతీపురం

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై పోరాటానికి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌తో కలిసి రావాలని పార్వతీపురం డిపో కన్వీనర్ ఎఎస్‌టి బాబు ఆర్టీసీ కార్మిక సంఘాలను కోరారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై గేట్ ధర్నాల పోరాటం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై స్టాఫ్ అండ్ వర్కర్స్ (సిఐటియు) పోరాడుతుందన్నారు. ఇందులో ఎన్ని సంఘాలు కలిసి వచ్చినప్పుడు సమస్యలపై నుంచి గట్టెక్కగలమన్నారు. పార్వతీపురం డిపోలో చిన్న చిన్న తప్పుల నెపంతో ఆరుగుర్ని సస్పెండ్ చేయడం అత్యంత హేయమైన చర్యని ఖండించారు, 1/2000 జీవోను అమలు చేయకుండా ఐదేళ్లకొకసారి ఆర్టీసీ కార్మికులను బదిలీలు చేస్తామని ప్రభుత్వం చెబుతుందని, దీనివల్ల సిబ్బంది ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఆపాలని, లేకుంటే భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ పార్వతీపురం డిపో కన్వీనర్ బాబు

గిరిజన యూనివర్సిటీని తరలించొద్దు : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా జిల్లాకు కేటాయించిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ప్రస్తుతం పనులు కొనసాగుతున్న మెంటాడ మండలం కుంటినవలస వద్దే కొనసాగించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు, ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విభజన చట్టంలో గిరిజన యూనివర్సిటీని మన్యం జిల్లాలో ప్రారంభించాల్సి ఉండగా, 2019లో టిడిపి ప్రభుత్వం కొత్తవలసలోని రెల్లి వద్ద భూమి సేకరించిందని చెప్పారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం విజయనగరం జిల్లాలో మెంటాడ మండలం కుంటినవలస వద్ద శంకుస్థాపన చేశారని తెలిపారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగానైతే 2022 నాటికి గిరిజన యూనివర్శిటీ పూర్తి కావాల్సి ఉందని, వైసిపి, టిడిపి ప్రభుత్వాల కాలయాపన వల్ల ప్రస్తుతం నిర్మాణ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని చెప్పారు. మళ్లీ ఇప్పుడు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తవలస వద్ద గిరిజన యూనివర్సిటీని కొనసాగిస్తామనడంలో అర్థం లేదని, అలాంటి నిర్ణయం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని చెప్పారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలకు, ఈ ప్రాంత గిరిజనులకు తీరని ద్రోహం చేసినవారవుతారని చెప్పారు. జిల్లాలో ప్రస్తుత యూనివర్సిటీ పూర్తయితే ఈ ప్రాంత ప్రజలతో పాటు, సరిహద్దు రాష్ట్రాల గిరిజన విద్యార్థులకు ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ యూనివర్సిటీకి రూ.1100 కోట్లు నిధులు అవసరం కాగా, ఇంతవరకు కేవలం రూ.432 కోట్లు మాత్రమే కేటాయింపులు జరిగాయని చెప్పారు. పనులు త్వరగా జరగకపోవడానికి కేంద్రం నుంచి నిధులు పూర్తిస్థాయిలో రాకపోవడమే కారణమని తెలిపారు. టిడిపి ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన నిర్ణయంపై వెంటనే పునరాలోచన చేయాలని కోరారు. లేకుంటే జిల్లాలోని మేధావులు, ఉద్యోగులు, అన్ని పక్షాలను కలుపుకుని గిరిజన యూనివర్సిటీని మన్యం జిల్లాలోనే కొనసాగించేలా పోరాటానికి వెనుకాడేది లేదని చెప్పారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు వంతల సుందర్రావు పాల్గొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జ్యోతీరావు పూలే పాఠశాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మెనూ రికార్డులను, వంటగదిని పరిశీలించి విద్యార్థులకు వండిన పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు చదువుతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిసి హాస్టల్‌ను సందర్శించిన ప్రత్యేక అధికారి

కురుపాం: స్థానిక బిసి సంక్షేమ వసతిగృహాన్ని మండల ప్రత్యేక అధికారి కె.రామచంద్రరావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసర ప్రాంతాలను, మరుగుదొడ్లను పరిశీలించి అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి తాను సందర్శనకు వచ్చేటప్పుడు ఇలా ఉంటే బాగుండదని హెచ్చరించారు. హాస్టల్ పరిసర ప్రాంతాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి

కొమరాడ : విద్యార్థులకు తప్పనిసరిగా మెనూ ప్రకారం భోజనం పెట్టాలని మండల ప్రత్యేక అధికారి అంకెపల్లి రాజశేఖరరెడ్డి అన్నారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అధికారి రాజశేఖర్ రెడ్డి సందర్శించారు. ముందుగా విద్యార్థులకు వండిన ఆహారాన్ని పరిశీలించారు. కూరగాయల స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి శ్యామల, జెడ్‌పిటిసి ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపిపి నంగిరెడ్డి శరత్‌బాబు, మండల టిడిపి కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధన, ఎంపిడిఒ ఎం.మల్లికార్జున్ రావు, ఎంఇఒ-2 తిరుపతిరావు, కెజిబివి ప్రత్యేక అధికారి అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ ఎన్నికపై తర్జనభర్జన

నగర పంచాయతీ సమావేశంలో కొనసాగిన చర్చ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగరపంచాయితీ చైర్మెన్ యందవ రాధాకుమారి వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేయడంతో శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈమె రాజీనామాను అమోదించారు. కొత్త చైర్మన్ ఎంపికపై సమావేశంలో తీవ్ర చర్చ జరిగింది. వైసిపి పట్టణ అధ్యక్షులు, ఐదో వార్డ్ కౌన్సిలర్ వెలమల మన్మధరావు మాట్లాడుతూ ఒకటో వైస్ చైర్మన్‌గా ఉన్న రౌతు హనుమంతరావును అపద్దర్మ చైర్మన్‌గా ఆమోదిస్తూ తీర్మానం ప్రవేశపెట్టగా తుమ్మగుంట అనూష, పాపినాయుడు ఆమోదించారు. దీనిపై రెండో వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, ఇంకో కౌన్సిలర్ కిల్లారి మోహన్ అడ్డు తగిలారు. గురువారం రాత్రి వైసిపి కౌన్సిలర్ల సమావేశంలో ఈ విషయం ఎందుకు ప్రకటించలేదని, ఈ విషయం ముందు పార్టీలో చర్చించుకొని నిర్ణయం తీసుకుందామని అన్నారు. అలాగే రెండో వార్డ్ కౌన్సిలర్ ఆకుల కుమార్ మాట్లాడుతూ చైర్మన్ పదవి ఎస్సీ రిజర్వుడ్ కావడంతో తన్కఉ కేటాయించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్సీ విక్రాంత్ స్పందిస్తూ ఒకటో వార్డు ఖాళీగా ఉండగా చైర్మన్ ఎంపిక జరగదని, ప్రస్తుతానికి వైస్ చైర్మన్లకే అవకాశం ఉంటుందని చెప్పారు. 19వ వార్డ్ ఎన్నిక జరిగిన తర్వాత చైర్మన్ ఎంపికపై నిర్ణయం తీసుకుందామన్నారు. దీనిపై కమిషనర్ సర్వేశ్వరరావు మాట్లాడుతూ ఇద్దరు వైస్ చైర్మన్ల పేర్లు డిఎంఎకు పంపిస్తామని, నిబంధనలకు అనుగుణంగా ఎన్నిక జరుగుతుంది అని చెప్పారు.

ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ మేనేజర్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

బడికి, గుడికి, పార్కుకు ఉంచిన స్థలాలు కబ్జాకు గురయ్యాయని, వెంటనే ఆక్రమణలు తొలగించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని పట్టణ సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. అనంతరం పట్టణ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర, పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా, పడాల రాజశేఖర్ మాట్లాడారు. కొత్తవలసలోని జగనన్న కాలనీ, సర్వే నెం-118-1,3లో 4.66 సెంట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇళ్లు, రోడ్లు వేయగా మిగిలిన 46 సెంట్లు, 16 సెంట్లు అక్కడ నివాస ప్రాంత ప్రజలకు భవిష్యత్ అవసరాల నిమిత్తం బడి, గుడి, పార్కుకు ప్రజా అవసరాల కోసం స్థలాన్ని కేటాయించారని అన్నారు. ఈ స్థలంలో కొందరు ఆక్రమణదారులు కబ్జా చేశారన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు పలుమార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు ఇచ్చినా ఇంతవరకు ప్రాథమిక విచారణ కూడా చేయలేదన్నారు. భవిష్యత్తులో ఆక్రమణలు తొలగించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు వినతిని అందజేశారు. ధర్నాలు స్థానికులు హనుమంతు రాము, గెద్ద తులసి, గౌరమ్మ, చొక్కాపు చంద్రమౌళి, ఈశ్వరరావు, జానకి, శాంతి, కె.రాజు, ఎస్.చిరంజీవి, ఆర్.రాజు, ఐ.రోహిణి, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద సోలార్ కెమెరాలు

ప్రజాశక్తి -పాచిపెంట

మండలంలోని పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద నిఘా మరింత పెంచేందుకు అదనంగా రెండు సోలార్ కెమెరాలు శుక్రవారం ఏర్పాటు చేసినట్టు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు. కెమెరాలు రాత్రి సమయంలో కూడా విసిబిలిటీ ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. అలాగే రోడ్డు భద్రతలో భాగంగా మోటార్ వెహికల్ డ్రైవర్లకు ఘాట్ రోడ్ ఎక్కేటప్పుడు, కిందకు దిగిన తర్వాత రాత్రి సమయంలో నిద్ర కారణంగా ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సదరు డ్రైవర్లకు వాహనం నుంచి దించి నీటితో ముఖం కడిగించి మళ్లీ తిరిగి పంపడం జరుగుతుందన్నారు. దీనివల్ల నిద్రమత్తులో జరిగే ప్రమాదాలను నియంత్రించవచ్చునని ఎస్సై తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఎల్విన్ పేట పోలీసులు సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆంధ్రా - ఒడిశా రాష్ట్రాల నుంచి అక్రమ రవాణాపై ప్రత్యేక దష్టి సారించినట్లు ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగానే గుణుపూర్ జంక్షన్ వద్ద శుక్రవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి, నాటు సారాయి అక్రమ రవాణా నిలువురించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పలు సచివాలయాల్లో రెగ్యులర్ ఉద్యోగస్తులను నియమించాలని, సిబ్బంది లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని ఎంపిడిఒకు సిపిఎం, టిడిపి, జనసేన నాయకులు శుక్రవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని పలు సచివాలయాల్లో రెగ్యులర్ డిజిటల్ అసిస్టెంట్, విఆర్ఒ, సర్వేయర్లు లేక ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని నారాయణపురం లాంటి పెద్ద గ్రామంలో లేకపోతే మిగతా సచివాలయం పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటుందన్నారు. విద్యుత్ బిల్లులు కట్టలేక చదువుకున్న పిల్లలు రియంబర్స్‌మెంట్ నమోదు కోసం వెరిఫికేషన్ కోసం సచివాలయాలకు వెళ్తే వెల్ఫేర్ అసిస్టెంట్ డిజిటల్ అసిస్టెంట్ ఇతర సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున మండలంలో రెగ్యులర్ ఉద్యోగులను నియమించి ప్రజలకు అందుబాటులో ఉండేలా పని చేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గేదెల సత్యనారాయణ, మండల పెదపాపినాయుడు, పి.ప్రసాద్, పకీర్ నాయుడు, పి.కన్నబాబు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతో ఉండాలని ఎస్ఐ లంక శ్రీనువాసరావు అన్నారు. మండలంలోని సంకల్పంలో భాగంగా సీతానగరం బజార్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ మీకు తెలియని వ్యక్తుల నుంచి లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జయలక్ష్మి కానిస్టేబుల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక మెయిన్ రోడ్‌లో పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల 15 సూత్రాల గురించి వివరించారు. ఖైనీ, గుట్కా, గంజాయి వంటి చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల గురించి వివరించారు. మహిళా చట్టాల భద్రత, రక్షణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌సి జనార్ధనమ్మ, పోలీసులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులకు దోమతెరలు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పల్లె నిద్రలో భాగంగా గురువారం మండలంలోని రాయగడ జమ్ము గ్రామం దగ్గరలో ఉన్న గొరడ కుగ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలను జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య పరిశీలించారు. భోజనం ఎలా ఉంది. ఉపాధ్యాయులు పాఠాలు బాగా చెబుతున్నారా లేదాని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ విద్యార్థులు దోమలతో ఇబ్బంది పడడం గమనించారు. వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రం నుండి 20 దోమ తెరలను తెప్పించి విద్యార్థులకు ఇచ్చారు. ఈ సందర్భంగా బాగా చదువుకోవాలని, చదువే భవిష్యత్‌ను నిర్దేశిస్తుందని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాలు రవి కుమార్, సర్పంచ్ పి.అమల ఉపాధ్యాయులు, విఆర్ఒ పి.జయరాం, విఎఫ్ఎ వెంగళ రాయుడు, జి.వాసుదేవనాయుడు, వైద్య, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న చిన్నారులు, గిరిజనులు

పాఠశాల భవనం నిర్మించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని ఎగువగొట్టూరులో పాఠశాల భవనం పూర్తిస్థాయిలో నిర్మించి విద్యార్థులకు సక్రమంగా చదువు నేర్పించాలని గొట్టూరు పంచాయతీ వైస్ సర్పంచ్ సేబి రామయ్య, స్థానిక గిరిజనులు సేబి తమ్మయ్య, పోయి రమేష్ ఆధ్వర్యంలో మధ్యలో పనులు ఆగిపోయిన స్కూల్ బిల్డింగు వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ఏడాదిన్నర కిందట నిర్మాణంలో ఉంటూ మధ్యలో ఆగిపోయిన స్కూల్ బిల్డింగును వెంటనే పూర్తి చేసి పిల్లలకు మంచిగా చదువు నేర్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ సర్పంచు సేబి రామయ్య మాట్లాడుతూ వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీంతో చదువుకోవడం చాలా కష్టంగా ఉందని తెలిపారు. స్కూల్ బిల్డింగు లోపల ఎటువంటి రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందని, వెంటనే భవన నిర్మాణం పూర్తి చేసి ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పోయి వెంకన్న, లచ్చయ్య, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షతపై ర్యాలీ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మహిళా సమైక్య మండల అధ్యక్షులు కె.లలిత కుమారి ఆధ్వర్యంలో శుక్రవారం లింగ వివక్షతపై ర్యాలీ నిర్వహించారు. మహిళపై జరుగుతున్న వివక్షత, బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఎం కె.రాము, హెచ్‌డిసి సి.ఉదయ్ కుమార్, ఎఫ్ఇఒ సిసి వై.ఆనంద రావు, విఒఎ పాల్గొన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మానవహారం చేపట్టారు.

బాల్యవివాహాలతో నష్టం

ప్రజాశక్తి - సాలూరు

బాల్యవివాహాలతో నష్టదాయకమని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు చెప్పారు. శుక్రవారం స్థానిక వైటిసిలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన మహిళలకు బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాలను ప్రోత్సహించొద్దని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. బాల్యవివాహాలు చేసుకున్న వారి ఆరోగ్యం పాడవ్వడంతో పాటు పుట్టబోయే పిల్లల ఆరోగ్యం కూడా పాడవుతుందని చెప్పారు. మెరుగైన కుటుంబ వ్యవస్థ కోసం బాల్యవివాహాల నియంత్రణ చేయాలని కోరారు. కార్యక్రమంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మోహనరావు, కనకరత్నం పాల్గొన్నారు.

అపరాల సాగులో అంతర పంటగా కూరగాయలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతులు సాగులో వైవిధ్యత కోసం అపరాల సాగులో అంతర పంటగా ఆకు, కూరగాయలు పండించుకొని అధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని పెద్ద బొండపల్లి, లచ్చిరాజుపేటలో రైతులతో సమావేశం నిర్వహించి వరి అనంతరం రబీ సీజన్లో సాధారణంగా రైతులు సాగు చేసుకునే మినుము, పెసర పంటల్లో వైవిధ్యత కోసం పొలాల్లోని ప్రతి రెండు మీటర్లకు ఒక వరుస చొప్పున మొక్కజొన్న, గోంగూర, ఆముదం, గోరుచిక్కుడు, తదితర పంటలను ఒక వరుస క్రమంలో వేయాలని సూచించారు. దీనివల్ల మినుము, పెసర వంటి అపరాలతో పాటు ఇతర పంటలతో పాటు సమాంతరంగా ఎదిగి రైతులకు అదనపు ఆదాయం వస్తుందని అన్నారు.పంటల వైవిధ్యత వల్ల తెగుళ్ల అరికట్టడమే కాకుండా పంటను కాపాడవచ్చని రైతులకు వివరించారు. కార్యక్రమంలో జెడ్ బి ఎన్ ఎఫ్ ఆర్ టి ఓ హేమ సుందర్, మాస్టర్ ట్రైనీ శ్రీరాములు రైతులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11గంటలకు చైర్పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని కమిషనర్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే విజయ్‌చంద్ర హాజరవుతారని, కావున కౌన్సిల్ సభ్యులతో పాటు, కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

గిరిజనులకు చేపపిల్లలు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కీసరజోడు, దిబ్బగూడ, బొక్కిడిగూడ, నడిమిగూడ, తాబేలువలస గ్రామాల్లో 11 చెరువులకు గానూ 41,900 చేపపిల్లలను ఐటిడిఎ నిధులతో శుక్రవారం పంపిణీ చేశారు. సీతంపేట, ఐటిడిఎ ద్వారా 100 శాతం సబ్సిడీపై ఈ చేప పిల్లలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్ నిమ్మక విజేత, ఆదినారాయణ, కీసరజోడు సచివాలయ సిబ్బంది మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు..

సిరిపురపు కుటుంబానికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి-పాలకొండ

భామిని మండలం నులకజోడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరిపురపు శ్రీనివాసరావు అకాల మృతి చెందడంతో శుక్రవారం సీతంపేటరోడ్‌లో ఆయన స్వగృహంలో మృతదేహానికి పలువురు నేతలు నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అక్కడకు వెళ్లి సంతాపం ప్రకటించారు. శ్రీను మాస్టారు చనిపోవడం చాలా బాధాకరమని, ఆయన మృతితో ఒక మంచి వ్యక్తిని కోల్పోయామని అన్నారు. నగరపంచాయితీ సమన్వయకర్త వెళ్లి తన సానుభూతి తెలిపారు. పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి ప్రయత్నించిన మంచి వ్యక్తి అని సంతాపం తెలిపారు.

సుడా చైర్మన్‌కు జనసేన అభినందనలు

ప్రజాశక్తి -వీరఘట్టం

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో కొత్తగా రాష్ట్ర సుడా చైర్మన్‌గా ఎన్నికైన పాలకొండ నియోజక జనసేన నాయకులు కోరికన రవికుమార్‌ను శుక్రవారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మండలంలోని పాపంపేట నాయకులు పొగిరి జగన్మోహన్రావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

కరాటేలో యాగ్నిక్‌కు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దూరుకు చెందిన ఆరిక యాగ్నిక్ (5) కరాటేలో గోల్డ్ మెడల్ సాధించి శభాష్ అనిపించుకున్నాడు. ఈనెల 24న విశాఖ ఇన్విటేషన్‌ల్ ఎంటర్ టేట్ కరాటే ఛాంపియన్షిప్ 2024 అండర్ ఏజ్ కటా విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు కోచ్ ఆరిక సింహాచలం తెలిపారు

నేరాలు ఘోరాలు

పాముకాటుతో వ్యక్తి మృతి

ప్రజావక్తి- కురుపాం

పాముకాటుతో దేవరాపు త్రినాథ్ (55) మృతి చెందిన సంఘటన మండలంలోని జి.శివడలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం...బతుకుతెరువు కోసం కుటుంబ సభ్యులంతా జియ్యమ్మవలస మండలం గెడ్డ తిరువాడలో ఇటిక బట్టీలు కోతలు నిమిత్తం వెళ్లి జీవనం సాగిస్తుండగా జి.శివడలో తాము తిండికి నిమిత్తం పండించుకున్న వరి కోతకు వెళ్లాడు. గురువారం సాయంత్రం పాము కాటు వేయడంతో ద్విచక్ర వాహనంపై భద్రగిరి ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

400 సారా ప్యాకెట్లు స్వాధీనం

కొమరాడ : అక్రమంగా తరలిస్తున్న 400 లీటర్ల నాటు సారా ప్యాకెట్లను, ఒక ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని అర్తాం వద్ద నాటు సారా రవాణా చేస్తున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఒక మోటార్ సైకిల్, 400 నాటు సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. గుమడకు చెందిన వెలగాడ సింహాద్రిని అరెస్ట్ చేసి నాటుసారా ప్యాకెట్లను, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనపర్చుకొని నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ రేవతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరురూరల్ : పట్టణంలోని ఎరుకుల వీధిలో ఒడిశాలోని పొట్టంగి బ్లాక్‌లో లావుడికి చెందిన నలుగురు మహిళల వద్ద నుండి 600 సారాయి ప్యాకెట్లు,60 లీటర్ల నాటు సారాయిను పట్టుకున్నట్లు సాలూరు పట్టణ పోలీసులు తెలిపారు. ఇకపై ఎవరైనా నాటుసారాతో ఎవరైనా పట్టుబడినట్లు అయినా చట్టరీత్యా చర్యలు తీసుంటామని పట్టణ సిఐ బి.అప్పలనాయుడు తెలిపారు.

కాల్పులు జరిపిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని దుగ్గిలో ఇటీవల బి.లక్కాయిపై కాల్పులు జరిపిన కె.రాజేష్‌ను పాలకొండ సిఐ చంద్రమౌళి అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు దోనుభాయి ఎస్ఐ షేక్ మస్తాన్ తెలిపారు. కాల్పుల్లో గాయాలపాలైన లక్కాయి విశాఖ కెహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.